31% పెరిగిన ఖైదీల సంఖ్య

- వార్షిక నివేదికలో డీజీ సౌమ్య మిశ్రా వెల్లడి
- రాష్ట్రంలో పెరిగిన నేరాలకు ఇదే నిదర్శనం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నేరాల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో గత ఏడాది కాలంలో జైళ్లకు వెళ్లిన ఖైదీల సంఖ్య కూడా భారీగా 31 శాతం పెరిగింది. 2023లో వివిధ నేరాలకు పాల్పడి 31,428 మంది జైళ్లకు వెళ్లగా.. నిరుడు ఆ సంఖ్య మరో 9,710 పెరిగి 41,138కు చేరినట్టు బుధవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన కేసుల్లో నిరుడు అత్యధికంగా 6,417 మంది నిందితులను జైళ్లకు పంపినట్టు తెలిపారు. పోక్సో కేసుల్లో 3,750 మంది, హత్య కేసుల్లో 2,754 మంది జైళ్లకు వచ్చినట్టు పేర్కొన్నారు. మొత్తం ఖైదీల్లో 30 ఏండ్లలోపు వయసువారు 18,855 మంది, గ్రాడ్యుయేట్లు 750 మంది, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు 225 మంది ఉన్నట్టు వివరించారు. క్షమాభిక్ష ద్వారా నిరుడు 213 మంది ఖైదీలు విడుదలయ్యారని, వారిలో 205 మంది జీవిత ఖైదీలున్నారని వెల్లడించారు. ఖమ్మం జిల్లా ఆత్కూరు గ్రామంలో కొత్తగా 3.15 ఎకరాల్లో సబ్‌జైలును నిర్మించనున్నట్టు తెలిపారు. అనంతరం మీడియా ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ.. లగచర్ల రైతులకు సంకెళ్లు వేసిన ఘటనలో జైలు అధికారిని సస్పెండ్ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు మురళీబాబు, రాజేశ్, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

22 వరకు ఎస్సెస్సీ ఫీజు చెల్లింపు గడువు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపునకు అధికారులు మరో అవకాశం ఇచ్చారు. రూ. వెయ్యి ఆలస్య రుసుముతో ఈ నెల 22 వరకు ఫీజు చెల్లింపునకు గడువు పెంచినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ప్రకటనలో తెలిపారు.

మహిళా రైతుపై పోలీసుల ప్రతాపం

- పరిహారం అడిగిన పాపానికి దౌర్జన్యం
- ఆత్మహత్యకు యత్నించిందంటూ దవాఖానకు తరలించిన పోలీసులు
- 'చిన్న కాళేశ్వరం'పై రెండోరోజు కొనసాగిన ఆందోళన
- ఎల్కేశ్వరంలో పోలీసుల మోహరింపు

మహిళా రైతును లాక్కెళ్తున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి. జనవరి 8 (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్ : తమ భూమికి పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలని ఆందోళన చేస్తున్న మహిళా రైతుపై పోలీసులు ప్రతాపం చూపించారు. ఆమెను తీవ్రంగా కొట్టి ఆత్మహత్యకు ప్రయత్నించిందని చెప్పి తీసుకెళ్లి దవాఖానలో పడేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని ఎల్కేశ్వరం గ్రామంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు మెయిన్ కెనాల్ పనులను తమ భూములకు పరిహారం ఇచ్చిన తర్వాతే కొనసాగించాలని చేస్తున్న ఆందోళన రెండు రోజులకు చేరింది. మంగళవారం నుంచి ఆందోళన చేస్తున్న మహిళా రైతు కమలను ఆత్మహత్యకు ప్రయత్నించిదంటూ దవాఖానకు తరలించి పోలీసులు బుధవారం హైడ్రామా ఆడారు. ఆమెను దవాఖానకు తరలిస్తుండగా పనులు చేస్తున్న వాహనాలకు అడ్డంపడ్డ రైతులపైనా తమ ప్రతాపం చూపారు. కాగా కమలను పోలీసులు విపరీతంగా కొట్టి అక్కడి నుంచి ఆత్మహత్యాయత్నం పేరిట దవాఖానకు తరలించారని, పరిస్థితిని తమ అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు కొత్త డ్రామా ఆడారని ఆమె కొడుకు రవీందర్ చెప్తున్నాడు.

పోలీసులను మోహరించి పనులు

సుమారు 20 మంది రైతులు దాదాపు 10 ఎకరాల భూములను 20 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారని, అధికారులు ఇప్పుడు అది ప్రభుత్వ భూమి అని పేర్కొంటున్నారని, ఎలాంటి పరిహారం ఇవ్వకుండా.. కనీసం నోటీసులివ్వకుండా.. సర్వే కూడా చేయకుండా లాక్కుంటున్నారని ఎల్కేశ్వరం రైతులు ఆరోపిస్తున్నారు. తమ భూమి పోతుందన్న బాధతో మొదటిరోజు (మంగళవారం) రాళ్లబండి రజిత ఆత్మహత్యాయత్నం చేయగా రెండో రోజు (బుధవారం) మరో మహిళ రాళ్లబండి కమల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని పోలీసులు ఆమెను మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దీంతో అక్కడే ఉన్న రైతులు పనులు చేస్తున్న వాహనాలకు అడ్డుగా పడుకుని ఆందోళన చేపట్టారు. పోలీసులు వారిని బలవంతంగా తరలించి పరిస్థితిని వారి అదుపులోకి తీసుకుని కాలువ పనులను ప్రారంభించారు.

నేను పురుగుల మందు తాగలే

మా భూముల్లో అధికారులు, పోలీసులు కాలువ పనులు చేస్తుండ్రు. మా భూముల్లోంచి పనులు చేయద్దని, అందరిలెక్క మాకూ పైసలిచ్చి పనులు చేసుకోండ్రని ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా ఎవరూ వింటలేరు. నిన్న ఇట్లనే గొడవైంది. ఇయ్యాల కూడా మా భూములకు పైసలిచ్చి తీసుకోండని బతిలాడినం. వాళ్లు వినకపోతే అక్కడే కుర్చున్నం. పోలీసులు ఇష్టం వచ్చినట్టు కొట్టిండ్రు. నేను పురుగుల మందు తాగిన అని సెప్పి నన్ను బాగా కొట్టుకుంట తీసుకొచ్చి దవాఖానల ఏసిండ్రు. నేను ఏ పురగుల మందూ తాగలే. పోలీసులు కావాలని ఇదంతా చేసిన్రు. – రాళ్లబండి కమల, రైతు

మా అమ్మను దారుణంగా కొట్టిండ్రు

20 మంది పోలీసులు, 10 మంది ఎస్ఐలు, సీఐలు వచ్చిండ్రు. మా అమ్మను దారుణంగా కొట్టిండ్రు. అందరి వద్ద నుంచి సెల్‌ఫోన్లు లాక్కున్నరు. సెల్‌ఫోన్లలో వీడియోలు, ఫొటోలు తీయనివ్వలేదు. పొద్దున్నే మా భూముల వద్దకు వచ్చిండ్రు. మూడు జేసీబీలతో కెనాల్ పనులు మొదలుపెట్టిండ్రు. మమ్మల్ని ఇష్టం వచ్చినట్టు కొట్టిండ్రు. బలవంతంగ భూములు గుంజుకోవడం ఏంది? ఆడ, మగ తేడా లేకుండా దారుణంగా కొట్టి పనులు చేస్తారా? మాకు ఏదైనా జరిగితే ప్రభుత్వం, పోలీసులదే బాధ్యత. – రవీందర్, కమల కొడుకు

పత్తి కొనుగోళ్లలో దోపిడీపై ఆగ్రహం

ఆసిఫాబాద్‌లో రైతుల ఆందోళన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 8: 'సీసీఐ అధికారులు.. దళారులు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నరు. తేమ పేరిట కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నరు. మాకు న్యాయం చేయాలి' అంటూ రైతులు బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వాసుపూజ జిన్నింగ్ మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. స్థానిక జిన్నింగ్ మిల్లుకు అంకుషాపూర్‌కు చెందిన రైతు బుట్లే శంకర్ ట్రాక్టర్‌లో పత్తి తీసుకొచ్చాడు. సీసీఐ అధికారులు తేమశాతాన్ని పరీక్షించి ఎనిమిది శాతం ఉన్నట్టు తెలిపారు. ట్రాక్టర్‌ను సగం ఖాళీ చేశాక పక్కనే ఉన్న దళారీకి సంబంధించిన ఓ వ్యక్తి వచ్చి పత్తి నాణ్యత లేదని సీసీఐ అధికారులకు చెప్పడంతో వారు తిరస్కరిస్తున్నట్టు ఎంట్రీ పాస్‌పై రాశారు. దీంతోపాటు మరో నాలుగు వాహనాలను సైతం ఇదే కారణంతో తిరస్కరించారు. ఆపై దళారీ వచ్చి క్వింటాల్‌కు రూ. 6 వేల చొప్పున తీసుకుంటామని, లేదంటే పత్తిని ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని అని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. అయినా ఫలితం లేకపోవడంతో చేసేదేమీ లేక కన్నీరు పెట్టుకున్నారు. సీసీఐకి పత్తిని అమ్మేందుకు రెండు రోజులుగా రోజుకు రూ. 2 వేల చొప్పున ట్రాక్టర్ కిరాయి చెల్లించి క్యూలైన్‌లో వేచి ఉన్నా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు.

ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఎక్కడ అమ్మాలి?

రెండు రోజుల కింద 30 క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చిన. బుధవారం కాంటా పెట్టిన్రు. పత్తి నాణ్యత లేదని కొనుగోలు చేయమన్నరు. ఉట్టిగా ట్రాక్టర్ కిరాయి మీద పడ్డది. గిట్ల సీసీఐ నిరాకరిస్తే రైతులు పంట ఎక్కడ అమ్ముకోవాలి. – బుట్లే శంకర్, రైతు

బిల్లులు చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి

కమిషనర్‌కు సర్పంచుల జేఏసీ లేఖ

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య కోరారు. బుధవారం తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశామని, అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో కొంతమంది మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మధు, ప్రధాన కార్యదర్శి నాగయ్య, కోశాధికారి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరో ముగ్గురు రైతుల ఆత్మహత్య

- బ్యాంకు అధికారుల వేధింపులకు ఆసిఫాబాద్ జిల్లాలో యువరైతు బలి
- అప్పులు భారమై జనగామ, మానుకోట జిల్లాల్లో ఇద్దరు అన్నదాతల బలవన్మరణం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ)/ లింగాలఘనపురం/పెద్దవంగర : అప్పుల బాధ భరించలేక బుధవారం ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పు తీర్చకపోతే ఇంటిని వేలం వేస్తామని బ్యాంకు అధికారులు బెదిరించడంతో మనస్తాపం చెంది కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఒకరు, సాగు కలిసి రాక అప్పులు భారంగా మారడంతో జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున బలవన్మరణం చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-టీ మండలం శివపూర్‌కు చెందిన కారెం సంతోష్ (33) ఏడేండ్ల క్రితం సిర్పూర్-టీలోని సహకార బ్యాంకులో రూ. 30 వేల రుణం తీసుకున్నాడు. ఈ రుణంలో కొంత చెల్లించినప్పటికీ ఇంకా బకాయిపడ్డాడు. మంగళవారం బ్యాంకు అధికారులు సంతోష్ ఇంటికి వచ్చి.. రుణం తీర్చాలని.. లేకుంటే ఇంటికి తాళం వేసి వేలం వేస్తామని హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన సురేశ్ బుధవారం సాయంత్రం పురుగు మందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి సిర్పూర్(టీ)లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య కారెం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిర్పూర్(టీ) ఎస్సై కమలాకర్ తెలిపారు.

లక్ష దాటిన అప్పు..

సంతోష్ (ఫైల్)

లక్షల్లో అప్పులు తీసుకొని.. తిరిగి కట్టని పెద్దల పట్ల మెతక వైఖరి అవలంబించే బ్యాంకు అధికారులు చిన్న, సన్నకారు రైతుల వద్ద మాత్రం కఠినంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కారెం సంతోష్ ఏడేండ్ల క్రితం రూ. 30 వేలు అప్పు తీసుకోగా.. వడ్డీ, చక్రవడ్డీలు వేయడంతో అది కాస్త రూ.లక్ష కుపైగా చేరినట్టు తెలుస్తున్నది. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించే రైతు సంతోష్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణే కష్టంగా ఉండగా, అప్పు తీర్చడం తలకు మించిన భారంగా మారింది. అధికారులు వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

లింగాలఘనపురంలో..

శంకర్ (ఫైల్)

జనగామ జిల్లా లింగాలఘనపురానికి చెందిన నక్క పెల్లి శంకర్ (42) తనకున్న రెండెకరాలను సాగు చేయడంతోపాటు ఎకరం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఆశించిన మేర దిగుబడులు లేకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. సాగుతోపాటు ఇంటి అవసరాల కోసం మొత్తం రూ.8 లక్షల వరకు అప్పు అయ్యింది. వీటిని తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన శంకర్ బుధవారం లింగాలఘనపురం – పటేలుగూడెం, నెల్లుట్ల గ్రామాల మధ్యన మిత్రుడి వ్యవసాయ బావి దగ్గర చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గంట్లకుంటలో రైతు శ్రీధర్..

శ్రీధర్ (ఫైల్)

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంటకు చెందిన కన్నె శ్రీధర్(41) తనకున్న 2.20 ఎకరాల భూమితో పాటు మరో 7.20 ఎకరాలను కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అందులో మిర్చి, వరి, మక్కజొన్న సాగు చేశాడు. పంట సాగు కోసం రూ.7 లక్షల దాకా అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక ఆందోళనకు గురయ్యాడు. తీవ్రంగా కుంగిపోయిన శ్రీధర్ నాలుగు రోజుల క్రితం తన వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని ఎస్సై కాంత్రికిరణ్ తెలిపారు.

మే దాకా కొత్త నోటిఫికేషన్లు లేనట్టే

- ప్రభుత్వం నుంచి టీజీపీఎస్సీకి చేరని ఇండెంట్లు
- ఖాళీల వివరాలివ్వాలని లేఖ రాయనున్న కమిషన్
- ఏప్రిల్‌లో నోటిఫికేషన్లపై కసరత్తు
- ఆ తర్వాతే నోటిఫికేషన్లు వెలువడే అవకాశం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): 'ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. ఇకవరుసగా నోటిఫికేషన్లు వస్తాయి. ఉద్యోగాల కోసం పోటీపడొచ్చు'ని ఆశపడుతున్నారా? అయితే మీ ఆశలు నెరవేర్చుకునేందుకు మే దాకా ఓపిక పట్టాల్సిందే. ఎందుకంటే ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చేందుకు టీజీపీఎస్సీ వద్ద ఖాళీ పోస్టుల వివరాల్లేవు. ప్రభుత్వం నుంచి కొత్త ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ఇండెంట్లు టీజీపీఎస్సీకి చేరలేదు. ఒక్కటంటే ఒక్క ఇండెంట్ కూడా టీజీపీఎస్సీకి అందలేదు. మొత్తంగా ఉత్తచేతులతో నోటిఫికేషన్లు ఇవ్వలేని స్థితిలో టీజీపీఎస్సీ నడుస్తున్నది. ఆ లోపు గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన ఫలితాలు విడుదల చేసే పనిలో టీజీపీఎస్సీ నిమగ్నమైంది. పెండింగ్‌లో పడిన నోటిఫికేషన్లను క్రమంగా క్లియర్ చేసే పనిలో పడింది.

మార్చి 31లోగా ఖాళీల వివరాలివ్వండి..

నోటిఫికేషన్లు ఇచ్చేందుకు తమ వద్ద ఖాళీల వివరాలు లేకపోవడంతో టీజీపీఎస్సీయే చొరవ ప్రదర్శిస్తున్నది. ఈ మార్చి 31లోగా శాఖల వారీగా భర్తీచేసే ఖాళీల వివరాలను సమర్పించాలని త్వరలోనే ప్రభుత్వానికి లేఖను రాయనున్నది. ఏడాది కాలంలో భర్తీ చేసే మొత్తం పోస్టుల వివరాలను తమకు అందజేయాలని కోరనున్నది. మార్చిలోగా ఖాళీల వివరాలు ఇవ్వాలంటే ముందుగా ప్రభుత్వం శాఖల వారీగా ఖాళీలను తేల్చాలి. అవసరమైన మేరకు కొత్త పోస్టులను మంజూరు చేయాలి. ఈ ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలపాలి. ఆయా ఇండెంట్లు టీజీపీఎస్సీకి చేరాలి. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నది. సర్కారు నుంచి వివరాలన్నీ మార్చి 31లోగా ప్రభుత్వానికి చేరితే ఏప్రిల్‌లో కసరత్తు చేసి మే నెలలో లేదా ఆ తర్వాత నోటిఫికేషన్లు ఇచ్చే ఆలోచనలో టీజీపీఎస్సీ ఉన్నది. అంతదాకా నిరుద్యోగులు నిరీక్షించాల్సిందే.

ఏ ఏడాది పోస్టులు ఆ ఏడాదే..

ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించడంపై టీజీపీఎస్సీ దృష్టిసారించింది. ఏ ఏడాది జారీచేసిన నోటిఫికేషన్లను ఆ ఏడాదే పూర్తిచేయాలన్న ఆలోచనలో కమిషన్ ఉన్నది. ఏప్రిల్‌లో కసరత్తును ప్రారంభించి మరుసటి సంవత్సరం మార్చి 31వ తేదీలోగా నియామకాలను భర్తీ చేయాలని కమిషన్ భావిస్తున్నది. ఎన్ని పోస్టులున్నాయన్నదాంతో సంబంధం లేకుండా 1, 2 పోస్టులున్నా నోటిఫికేషన్ విడుదల చేయాలని భావిస్తున్నది.

సంక్రాంతికి 6 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి నేపథ్యంలో ఈ నెల 10 నుంచి 13 వరకు 6 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. హైదరాబాద్-కాకినాడ, హైదరాబాద్-తిరుపతి, చర్లపల్లి-కాకినాడ మధ్య ఈ రైళ్లు నడుస్తాయని తెలిపింది. కాకినాడ-విశాఖపట్నం, గుంటూరు-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్లలో నాలుగింటిని రద్దు చేసినట్టు పేర్కొంది. ఈ నెల 11, 12 తేదీల్లో ఈ రైళ్లు నడువవని వెల్లడించింది.

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడో!

- ఈ నెల 26తో పాలక మండళ్ల గడువు పూర్తి
- 27 నుంచి అమల్లోకి ప్రత్యేకాధికారుల పాలన
- 42శాతం బీసీ రిజర్వేషన్ల సంగతేమిటని ప్రశ్నలు
- ఎన్నికలకు రెడీ అంటున్న ఎస్ఈసీ అధికారులు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో మున్సిపాలిటీలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఓవైపు 128 మున్సిపాలిటీల పాలక మండలి గడువు ఈ నెల 26తో ముగియనుంది. వీటిలో 120 మున్సిపాలిటీలు, 8 కార్పొరేషన్లు ఉన్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ గడువు 28న ముగియనుండగా మరుసటిరోజు నుంచే ప్రత్యేక అధికారుల పాలన మొదలవుతుంది. ఈ నేపథ్యంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-సీడీఎంఏ, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాల్సి వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. బీసీల రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవడంతో ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది.

బీసీ రిజర్వేషన్లపై అస్పష్టత

మున్సిపాలిటీల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికే చాలాకాలంగా పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తున్నది. ముందుగా వాటికి ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరముంది. మరోవైపు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని బీసీలు తేల్చిచెబుతున్నారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే రిజర్వేషన్లపై స్పష్టతరానుంది. ఈ లోగానే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తుందా? వేచి చూస్తుందా? అనేది తేలాల్సి ఉంది.

ప్రతికూల పవనాలతో కష్టమే!

ప్రత్యేక అధికారుల పాలనతో పంచాయతీలలో అభివృద్ధి కుంటుపడింది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో మున్సిపాలిటీల నిర్వహణ కూడా గగనంగా మారింది. చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని ప్రజలు రోడ్డెక్కుతున్న ఉదంతాలే ఇందుకు నిదర్శనం. కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయడం లేదంటూ రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, వృద్ధులు ఆగ్రహంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రతికూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికిప్పుడే ఎన్నికలకు వెళ్లకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై గ్రామాలు, పట్టణాల్లో జరిగిన వివిధ సర్వేలు కూడా ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను స్పష్టంచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు వెళ్తే భంగపాటు తప్పదని కొందరు కాంగ్రెస్ సీనియర్‌నేతలు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు 2026 మే 6న గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లు సిద్దిపేట, అచ్చంపేట్, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్ మున్సిపాలిటీల గడువు ముగియనుంది.

'డీఏ, పీఆర్సీలపై ప్రభుత్వంతో చర్చిస్తాం'

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బిల్లుల మంజూరు, డీఏ, పీఆర్సీ తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పైనా చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని భరోసా కల్పించారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్(టీఎస్టీయూ) 2024 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శులు చందూరి రాజిరెడ్డి, అరకల కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాజ్‌మహల్‌లో తెలంగాణ ఆనవాళ్లు!

- నిర్మాణంలో దేవరకొండ, మహబూబ్‌నగర్ రాళ్లు
- వెల్లడించిన కాలిఫోర్నియా నిపుణుల అధ్యయనం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వింతల్లో ఒకటైన అద్భుతమైన కట్టడం తాజ్‌మహల్ నిర్మాణానికి తెలంగాణ రాళ్లను వాడినట్టు నిపుణులు గుర్తించారు. కాలిఫోర్నియాలోని జెమోలాజికల్ లైబ్రరీ అండ్ రిసెర్చ్ సెంటర్ నుంచి రిటైర్డ్ లైబ్రేరియన్ డిర్లామ్, రిసెర్చ్ లైబ్రేరియన్ రోజర్స్, డైరెక్టర్ వెల్డన్ ఐదేండ్ల పాటు తాజ్‌మహల్ నిర్మాణంపై అధ్యయనం చేశారు. నిర్మాణంలో వివిధ దేశాల్లోని వజ్రాలు, వైడూర్యాలు, రత్నాలు, ముత్యాలు, స్ఫటికాలు, పచ్చలు వంటి ప్రత్యేక వస్తువులతో పాటు తెలంగాణలోని దేవరకొండ, మహబూబ్‌నగర్ నుంచి తీసుకెళ్లిన రాళ్లను వాడినట్టు గుర్తించారు. తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో పలుగు రాళ్లు విరివిగా కనిపిస్తాయి. అందులో కొన్ని క్రిస్టల్ లక్షణాలు కలిగి ఉంటాయి. వాటిని క్రిస్టల్ క్వార్ట్జ్‌గా పేర్కొంటారు. విలువైన స్ఫటికంగా పరిగణించే వీటిని కూడా నగల నగిషీల్లో వినియోగిస్తారు. వీటినే తాజ్‌మహల్ నిర్మాణానికి వినియోగించారని తేలింది.

గ్రూప్-3 ప్రాథమిక 'కీ' విడుదల

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 పరీక్షల ప్రాథమిక 'కీ'ని టీజీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. నవంబర్ 17, 18 న మూడు పేపర్లకు పరీక్షలు నిర్వహించగా, తాజాగా మాస్టర్ ప్రశ్నపత్రాలు, ప్రాథమిక 'కీ'ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ నెల 12 సాయంత్రం 5గంటల వరకు ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలు వ్యక్తంచేయవచ్చు.

నేడు సీడీపీవో ప్రాథమిక కీ..

మహిళా శిశు సంక్షేమశాఖలో సీడీపీవో పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ప్రాథమిక 'కీ' గురువారం విడుదల కానుంది. ప్రాథమిక 'కీ'పై ఈ నెల 11లోపు అభ్యంతరాలు వ్యక్తంచేయవచ్చు. 3, 4న పరీక్షలు నిర్వహించగా, రెస్పాన్స్ షీట్లతోపాటు ప్రాథమిక 'కీ'ని సైతం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

టీపీబీవో ఫలితాల విడుదల

టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఫలితాలను టీజీఎస్సీ ప్రకటించింది. మొత్తం 171 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జాబితా కోసం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

'హెచ్ఎంపీవీ'పై స్కూల్స్ అలర్ట్

- కరోనా నాటి జాగ్రత్తలు పాటించాలి
- ముందస్తుగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): దేశంలో హ్యూమన్ మెటా న్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని పాఠశాలలు అప్రమత్తమయ్యాయి. కరోనా నాటి జాగ్రత్తలను పాటించాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు జారీ చేశాయి. శానిటైజర్ ఉపయోగించాలని, తరుచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలని , కరచాలనం సహా రద్దీగా ఉండే ప్రదేశాల్లో సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నాయి. అనారోగ్యంతో ఉన్న పిల్లలను బడులకు పంపించొద్దని తెలిపాయి. ఈ విషయంపై ట్రస్మా సలహాదారు యాదగిరి శేఖర్‌ర